www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 12 ఫిబ్రవరి 2024

5

కాకినాడ

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునన్నారు.

పట్టాలిచ్చారు.. స్థలాలు మరిచారు..

- లబ్ధిదారుల ఎదురు చూపులు
- నాలుగేళ్లుగా అందని వైనం
- ప్రస్తుతం హడావిడిగా రిజిస్ట్రేషన్లు

పిఠాపురం మండలం నరసింగపురంలో అభివృద్ధి చేయని లే అవుట్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమకు నవరత్నాల పథకంలో ఇళ్ల పట్టాలిచ్చి నాలుగేళ్ల అయిందని, ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని సామర్లకోట మండలం కాపవరం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు వారం రోజుల క్రితం కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నిరుపేదలమైన 91 మందికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా ఇప్పటివరకు అనువైన స్థలాలు ఎందుకు చూపించలేదని అడుగుతుంటే అధికారులు:, పాలకులు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇలా జిల్లాలో వేలాదిమంది లబ్ధిదారులకు హడావుడిగా ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ నేటికీ స్థలాలు చూపించకపోవడంతో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వారికి సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారు. కొన్నిచోట్ల స్థలాలు చూపించినా అవి సుదూరంగా ఉండటం, నివాసయోగ్యంగా లేకపోవడం, కనీస సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాల వల్ల లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్నారు. అధికారులకు ఈ సమస్యలు తెలిపినా పట్టించుకోకపోవడం వల్ల అనేకమంది నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం హడావిడిగా రిజిస్ట్రేషన్లు చేయిస్తుండడంతో స్థలాలు అందుకోలేని లబ్ధిదారులు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కాకినాడ జిల్లావ్యాప్తంగా 1.20 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా సుమారు 70 వేల్ల ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు దాదాపు 30 వేల వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా అధికారులు తెలిపారు. సుమారు 10 వేల మంది లబ్ధిదారులకు పట్టాలు చేతికి అందజేశారు కానీ నేటికీ ఇళ్ల స్థలాలు చూపించలేదు. స్థలాలు సేకరించినా లే అవుట్లను అభివృద్ధి చేయలేదు. కొన్నిచోట్ల అభివృద్ధి చేసినా లబ్ధిదారులు అయిష్టత చూపుతున్నారు. గ్రామాలకు సుదూరంగా ఉండడంతోపాటు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతోనే పలువురు ఆ స్థలాల్లోకి వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. సామర్లకోట మండలం వికె.రాయపురంలో సుమారు 330 మంది లబ్ధిదారులకు నాలుగేళ్ల క్రితం దోమలపాకలు పొలాల మధ్యలో స్థలాలు సేకరించారు. లబ్ధిదారులు తొలుత అనుకూలంగా లేక వాటిని నిరాకరించారు. ప్రస్తుతం వైసిపి పాలన ముగుస్తున్న నేపథ్యంలో సంబంధిత స్థలాలను ఎత్తుచేసి రోడ్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పించి వెంటనే తమకు స్థలాలను అప్పగించాలని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం కలెక్టర్ కతికా శుక్లాకు తమ గోడు వెళ్ళబోసుకునేందుకు వచ్చారు. అనంతరం జెసిని కలిసి సమస్యలను చెప్పుకున్నారు. నాలుగేళ్ల క్రితం పట్టాలిచ్చినా మాకు ఇస్తామన్న స్థలాలను అభివృద్ధి చేయలేదని, కనీసం దారి మార్గం కూడా లేదని జెసి వద్ద వారు వాపోయారు. ఇదే మండలం మాధవపట్నం గ్రామానికి చెందిన సుమారు 500 మంది లబ్ధిదారులకు అదే గ్రామంలో స్థలాలను సేకరించినా నేటికీ చేతికి ఇవ్వలేదు. సుమారు నాలుగు అడుగులు ఎత్తు మేర భూమిని మట్టితో కప్పాల్సి ఉంది. అధికారులు లేఅవుట్లలో సౌకర్యాలు కల్పించకుండానే ఇప్పుడు హడావిడిగా రిజిస్ట్రేషన్లు చేయడం మొదలుపెట్టారు. భూమిని అభివృద్ధి చేయకుండా స్థలాలు చూపకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

సామర్లకోట మున్సిపాలిటీలో ఐదు వార్డులకు చెందిన 424 మంది లబ్ధిదారులకు వేట్లపాలెంలో 268 మందికి, హుస్సేన్‌పురం వద్ద 156 మందికి స్థలాలు చూపించగా లబ్ధిదారులు మొదట్లో విముఖత వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఇమ్మని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. పిఠాపురంలో సుమారు 4 వేల మంది లబ్ధిదారులకు నరసింగపురం-1, 2 లేఅవుట్లలో 56 ఎకరాలు, ఏడు కాలువల ప్రాంతంలో 18.49 ఎకరాలు, విరవాడ రోడ్డులోని 3.42 ఎకరాలు, కుమారపురం కొబ్బరితోటలో 1.82 ఎకరాలు, కుమారపురం వాటర్ వర్క్స్ వద్ద 5 ఎకరాలు, మసీదు మాన్యంలో 5.25 ఎకరాలు సేకరించారు. అభివృద్ధి చేయకుండానే ఇప్పుడు ఆయా స్థలాల్లో తుప్పలు తొలగించి, పొక్లెయిన్లతో చదునుచేసి, సరిహద్దు రాళ్లు పాతుతున్నారు. సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రౌతులపూడి మండలంలో 3,372 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 3,012 మందికి పట్టాలు పంపిణీ చేశారు. నేటికీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు. సుమారు 90 ఎకరాలను సేకరించారు. మండల కేంద్రంలో 12 ఎకరాల్లో 620 మందికి పట్టాలు ఇచ్చినా కోర్టు వివాదాలతో ఇక్కడా ఇంటి నిర్మాణాలు మొదలు కాలేదు.

కేంద్ర పథకాల చేరువకే వికసిత్ భారత్

ప్రజాశక్తి-కాకినాడ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అట్టడుగు, బలహీన వర్గాలకు చేరువ కావాలనే లక్ష్యంతోనే వికసిత్ భారత్ సంకల్పయాత్ర సదస్సులు నిర్వహిస్తున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. స్థానిక రాగంపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేసి పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా పథకాలకు అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానాలపై ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కేంద్ర పథకాలకు సంబంధించిన క్యాలెండర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. అభివృద్ధికి పునరంకితమవుతామని అక్కడికి వచ్చిన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మొబైల్ వాహనం ద్వారా కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడి భారత్ అగ్రస్థానంలో నిలవాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్య సాధనలో అన్ని వర్గాల ప్రజలూ భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, ఆయా కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు.

జ్ఞానంతో కాలపరీక్షలను ఎదుర్కోవచ్చు

ప్రజాశక్తి-పిఠాపురం


కుట్టు మిషన్లు అందజేస్తున్న పీఠాధిపతి ఆలీషా

మానవుడు తన జీవన పయనంలో ఎదురయ్యే కష్టాలు, నష్టాలు, దుఃఖాలు, బాధలు వంటి కాల పరీక్షలను ఎదుర్కోవాలంటే తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం 96వ వార్షిక జ్ఞాన మహాసభల ముగింపు సందర్భంగా ఆదివారం పీఠం ప్రధాన ఆశ్రమం వద్ద నిర్వహించిన సభలో ఆలీషా ప్రసంగించారు. కాలానికి అతీతంగా ప్రయాణించే జీవి ఏదీ ఈ సృష్టిలో లేదని వెల్లడించారు. కాలం సామాన్యుని మొదలుకుని తత్వవేత్తల వరకూ అందరికీ పరీక్ష పెడుతుందన్నారు. ఆది కవి నన్నయ యూనివర్సిటీ విసి కె.పద్మరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మికతత్వ ప్రభోదం, సామాజిక సేవల ద్వారా విశ్వమానవ శ్రేయస్సు కోసం పీఠం కృషి చేస్తోందన్నారు. పీఠం నిర్వహిస్తున్న ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా అందించిన కుట్టు మిషన్లు, పక్షుల ఆహారం కోసం ధాన్యపు కుచ్చులు, భవిత పాఠశాలకు ఎన్ఆర్ఐలు పేరూరి ఉమా అరవింద్, విజయరామ సుబ్బారావు, సన అందించిన ప్రింటర్‌ను ఆలీషా అందించారు. ఈ కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీత, సాహితీవేత్త జానకీరామచౌదరి, కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బుజ్జి, పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఎన్‌సిఎస్ ఇండస్ట్రీస్ అధినేత నారాయణం మురళి, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో చదువులు సాగాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బడి పిల్లల చదువులు ఆట పాటలతో సాగాలని, ఒత్తిడి లేకుండా ఆనందంగా, ఆహ్లాదకరంగా చదువులు ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు బడి పిల్లలకు సూచించారు. ఇంద్రపాలెంలో వైఎస్ఆర్ ఐడల్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఏం చదవాలి, ఎలా చదవాలి, ఎలా ఉండాలి' అనే అంశంపై బోధన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ జనార్థనం, అద్దేపల్లి ఉదయభాస్కర్ పిల్లలతో మాట్లాడారు. బట్టీ పట్టడం వల్ల ఫలితం కన్నా మనస్సు పెట్టి చదవాలని చెప్పారు. చదువుల్లో ఆటలు పాటలు కూడా భాగం అవ్వాలన్నారు. పెద్దలు, గురువుల పట్ల గౌరవ భావం ఉండాలన్నారు. కథలు, నీతి శతకాలు వినాలని హితవు పలికారు. సాటి విద్యార్థులతో స్నేహంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ కన్వీనర్ సిహెచ్.కిరణ్ కుమార్ ప్రముఖ కవి అద్దేపల్లి ప్రభు పాల్గొన్నారు.

నీటి పిల్లుల సంరక్షణతో జీవ వైవిధ్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జీవవైవిద్యానికి ఎంతగానో దోహదం చేసే నీటి పిల్లుల సంరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి అన్నారు. చొల్లంగిలోని కోరంగి పర్యాటక కేంద్రంలో కోరింగ వైల్డ్ లైఫ్ రేంజ్ ఆధ్వర్యంలో నీటి పిల్లుల దినోత్సవ ముగింపు కార్యక్రమం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ అధ్యతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎఫ్ఒ భరణి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన ఉండాలని, నూత్న ఆలోచనలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి పర్యావరణపై అవగాహన కల్పించారు. మానవ తప్పిదాల వల్ల జీవజాతులు అంతరించిపోతున్నాయని చెప్పారు. అలాంటి వాటిలో నీటి పిల్లులు ఒకటన్నారు. వాటిని సంరక్షించుకోవడానికి దినోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నీటి పిల్లుల పోస్టర్లను ఆవిష్కరించారు. రెండు నిమిషాల నిడివిగల నీటి పిల్లుల డాక్యుమెంటరీని విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎంజివి.ప్రసాద్, సిద్ధార్థ కుమార్, అరుణ, వసంత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ కె.గోపీనాగేంద్రకుమార్, మహేష్, ప్రసాద్, ధనుంజయరావు, ఆదిత్య కళాశాల ప్రతినిధులు టి.తేజేశ్వరరావు, దివాకర్ రావు, సిబ్బంది, ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా జిల్లాస్థాయి స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం 12న కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికాశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

నేడు పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 41 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రైతులపై ఉక్కుపాదం సరికాదు

ప్రజాశక్తి-కాకినాడ

చలో ఢిల్లీ పిలుపు ఇచ్చిన రైతులపై ఉక్కుపాదం మోపడం సరికాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను దేశ రాజధాని ఢిల్లీలోకి రానీయకుండా బారికేడ్లు, సిమెంట్ కాంక్రీట్ రోడ్లపై ఇనుప మేకులు అమర్చడం వంటి చర్యలు అత్యంత దురదృష్టకరమన్నారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం తీసుకురావాలని రైతులకు ఫించను, పంటల బీమా గత ఆందోళన సమయంలో విధించిన కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్న రైతుల కోసం ప్రభుత్వం చర్చలు చేపట్టి పరిష్కరించాల్సిన బాధ్యత వుందన్నారు.

పారుపాకలో 'వరుపుల' పర్యటన

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని పారుపాకలో ప్రత్తిపాడు వైసిపి ఇన్‌ఛార్జి మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు ఆదివారం పర్యటించారు. సర్పంచ్ పకుర్తి లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయమని వెల్లడించారు. తాను ఎంఎల్ఎగా పని చేసిన కాలంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శంకవరం ఎంపిపి పర్వత రాజబాబు. వైసిపి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి జమీలు, భాస్కర్ బాబు తదితరులు ఉన్నారు.

ప్రజలకు భరోసా కోసం నారా లోకేష్ 'శంఖారావం'

ప్రజాశక్తి కాకినాడ రూరల్

రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు నారా లోకేష్ శంఖారావం ప్రారంభించారని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం పూరించారన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో నారా లోకేష్ పర్యటించారని, ఆయన పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి వైసిపి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారని చెప్పారు.

వృద్ధుల జీవితాలకు భరోసా ఇవ్వండి

ప్రజాశక్తి-కాకినాడ

వృద్ధుల సమస్యలపై చర్చిస్తున్న యూనియన్ నాయకులు

వయోవృద్ధుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లిదండ్రులు వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని పటిష్టవంతంగా అమలు చేసి భరోసానివ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.నారాయణమూర్తి, కె.రామచంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనాభాలో 13 శాతం, ఓటర్ల లిస్టులో 18 శాతంగా ఉన్న వయోవృద్ధుల సమస్యలపై అన్నిరాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సూపర్‌బజార్ కార్యాలయ ఆవరణలో ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ, లేదా ప్రత్యేక కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాని, ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 60 ఏళ్ల పైబడిన అర్హులైన వృద్ధులకు రూ.6,500లు వద్ధాప్య పెన్షన్ ఇవ్వడంతోపాటు ఆర్‌టిసిలో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ అమలు చేయాలని కోరారు. అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో సీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

రాష్ట్ర సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అడహాక్ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా బల్లమూడి సూర్యనారాయణమూర్తి (పెద్దాపురం), ప్రధాన కార్యదర్శిగా ఆర్ఎస్. సుధాకరరావు, అసోసియేట్ అధ్యక్షునిగా జి.విశ్వేశ్వరరావు, కోశాధికారిగా వి.రామ సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా జెఎస్‌వి.ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మండవిల్లి భాస్కరరావు, కార్యదర్శులుగా వి.శివాజీగణేష్, జివిఎస్‌వివి. సత్యనారాయణమూర్తిని నియమించారు. ఈ సమాశంలో రాష్ట్ర కోశాధికారి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు కొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కార్మిక సంఘం నాయకుడు తాటిపాక మధు

16న బంద్, పారిశ్రామిక సమ్మె

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్రంలో బిజెపి ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న గ్రామీణ భారత బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం ఎఐటియుసి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో 14 మండలాల్లో 100 గ్రామాల్లో కరపత్రాలు పంచేందుకు ఆదివారం శాంతినగర్ నుంచి సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీని మధు ప్రారంభించారు. ర్యాలీలో తాటిపాక మధు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడారు. నరేంద్ర మోడీ వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలు, రవాణా బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నీటిని అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా అప్ప చెబుతున్నారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు నష్టాలు వస్తున్నాయని చెప్పి కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు కోడ్‌లు తెచ్చారని విమర్శించారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా మరొక రూపంలో వాటి అమలుకు ప్రణాళిక వేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయలేదని, ప్రత్యేక హోదా నిరాకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నవరం రామయ్య, శ్రీనివాసరావు, అప్పలరాజు, రమేష్, నాగయ్య పాల్గొన్నారు.

చర్చిల్లో తుమ్మల బాబు ప్రార్థనలు

ప్రజాశక్తి - సామర్లకోట

జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి ఆదివారం పలు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. సామర్లకోట పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, ఆగస్తానా లూథరన్ చర్చి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, ట్రూ గాస్పెల్ చర్చిల్లో ఆయన ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు పిట్టా జానకి రామారావు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి మాజీ కౌన్సిలర్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట వైసిపి మాజీ కౌన్సిలర్ పితాని సూర్యనారాయణ తన అనుచరులతో కలిసి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు అడబాల కుమార స్వామి ఆధ్వర్యంలో ఆదివారం సామర్లకోటలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సూర్య నారాయణతో పాటు సుమారు 80 మంది వైసిపి కార్యకర్తలకు చినరాజప్ప కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కూటమి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టిడిపి నాయకుడు తాతపూడి కృష్ణబాబు, కంటే జగదీష్ మోహన్, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ చిన్ని పాల్గొన్నారు.

'శివారు ప్రాంతాలకు తాగునీరు అందించా'

ప్రజాశక్తి-శంఖవరం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎంఎల్ఎగా పని చేసి మారు మూల ప్రాంతాలకు ప్రజలకు తాగునీరు అందించానని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన శంఖవరం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మండలంలోని డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత లబ్ధికింద రూ.8.5 కోట్ల ఆసరా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఎంపిపి పర్వత రాజబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వరుపుల మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలు ఈ నియోజకవర్గంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఆయన చెప్పారు. తన హయాంలో ప్రజల సౌకర్యార్థం 48 రహదారులు ఏర్పాటు చేశానని చెప్పారు. అనంతరం ఆయన డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల యువజన నాయకుడు పర్వత వివేక్ వివిధ గ్రామాల ఎంపిటిసిలు సర్పంచులు కత్తిపూడి, శంఖవరం అన్నవరం వైసిపి నాయకులు డ్వాక్రా సంఘాలు మహిళలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న వరుపుల

సహకార సంఘాల పాత్ర కీలకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రైతుల అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమైనదని వైసిపి ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి పరుపుల సుబ్బారావు అన్నారు. ఆదివారం లింగంపర్తి, ఏలేశ్వరం సహకార సంఘాల నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సహకార వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి రైతన్నల ఆర్థిక అభివృద్ధి మరింత మెరుగు పడిందన్నారు. లింగంపర్తి పిఎసిఎస్ నూతన అధ్యక్షునిగా వరుపుల సత్య సూరిబాబు, డైరెక్టర్లుగా కాశపు వీరబాబు, సోము సూర్యుడు, ఏలేశ్వరం పిఎసిఎస్ అధ్యక్షునిగా ఓలేటి చంటిబాబు, డైరెక్టర్లుగా దాసరి రమేష్, గూనాపు నాగబాబు ప్రమాణ స్వీకారం చేశారు. వరుపుల చిట్టిబాబు, ఏలేశ్వరం సిఇఒ జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ, కొండపల్లి ముత్యాలు, లింగంపర్తి సిఇఒ విజయ్ కుమార్ రాజు, కొమ్మన సత్యనారాయణ ఉన్నారు.

భవితా దీప్తి..బాలోత్సవ స్ఫూర్తి..

▸ రెండు రోజుల పాటు సందడే సందడి ▸ ఆటపాటలతో అలరించిన చిన్నారులు
▸ 32 విభాగాల్లో పోటీల నిర్వహణ ▸ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

చారిత్రక, సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన 'గోదావరి బాలోత్సవం' ఆదివారంతో ముగిసింది. రెండు రోజులుగా కళాశాల ప్రాంగణం బాలల కేరింతలతో మారుమోగింది. చివరి రోజు కోలాహలంగా...ఉత్సాహపూరిత వాతావరణంలో బాలోత్సవం ముగిసింది. ముగింపు వేడుక బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు వివిఎస్ఎస్.కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగింది. రాజమహేంద్రవరం మాజీ కమిషనర్ ఎం.జితేంద్ర, ప్రముఖ నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్, శ్రీవెంకటేశ్వరా ఫైనాన్స్ అధినేత వేణుగోపాల్, ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎన్ఎస్ఎస్.శర్మ, ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.రామ్మోహనరావు, ప్రముఖ కవి డాక్టర్ అరిపిరాల నారాయణరావు, సంఘ సేవకులు మాటూరి సిద్ధార్థ, స్వామి యాడ్స్ అధినేత భాస్కర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ చైతన్యశేఖర్ తదితరులు మాట్లాడారు. మంచి సమాజం కోసం అవసరమైన మానవవనరులను అందించేందుకు ఇటువంటి బాలోత్సవాలు అవసరమన్నారు. రాబోయే కాలంలో ఆక్సిజన్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితుల్లోకి సమాజం నెట్టబడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి రెండు రోజుల కార్యకలాపాలను వివరించారు. 32 విభాగాల్లో 5,600 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్, అకడమిక్ కార్యక్రమాల నిర్వాహకులు కాశీ విశ్వనాథం, కృష్ణకుమార్, సాయిబాబా, విజయబాబు, జివిరమణ, ఉపాధ్యాయులు అరుణకుమారి, షరీఫ్ తమ అనుభవాలను పంచుకున్నారు. అమరావతి బాలోత్సవం నిర్వాహకులు టి.క్రాంతికుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న వారికి అతిథుల చేతుల మీదుగా ముగింపు సభలో మెమోంటోలు, మెడల్స్ అందించారు. కల్చరల్ విభాగంలోని క్లాసికల్ డ్యాన్స్‌లో జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతిని తొర్రేడు బ్లోస్సాం స్కూల్ విద్యార్థిని రియాన్షికా రాయుడు సాధించింది. లఘు నాటికలో వేమగిరి జడ్‌పిపి హైస్కూల్ విద్యార్థిని కె.జ్ఞానశ్రీ, జానపద నృత్యంలో శ్రీసాయి బాలాజీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించారు. కోలాటంలో జయకృష్ణపురం స్విట్జర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, విచిత్ర వేషధారణల పోటీలో కాటన్ పేట శ్రీశివనంద యుపి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి పవన్ సందీప్, జానపద గీతాలాపనలో శ్రీరామ్‌నగర్ శ్రీగౌతమి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థుల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. దేశభక్తి, అభ్యుదయ గీతాలాపనలో శ్రీ గౌతమి ఇంగ్లీసు మీడియం స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అకడమిక్ విభాగం కవితా రచనలో కడియపు సావరం మినర్వా ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కె.స్వాతిప్రసన్న, కథా రచనలో చెముడులంక నేతాజీ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి ధనలక్ష్మి, చిత్రలేఖనం జూనియర్స్‌లో రాజమహేంద్రవరంలోని శ్రీ సత్యసాయి గురుకులం స్కూల్ విద్యార్థిని వి.శ్రీవాస్తవ శ్రావణి, సీనియర్ విభాగంలో కాకినాడ పనసపాడు లిటిల్ ఉడ్స్ స్కూల్ విద్యార్థిని సిహెచ్.ధశ్విక ప్రథమ బహుమతులను గెలుసుకున్నారు. పద్యం-భావం విభాగంలో హుకుంపేట జడ్‌పిపి హైస్కూల్ విద్యార్థిని టిహెచ్.సత్యవిష్ణు ప్రథమ బహమతిని సాధించింది. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. అలాగే వివిధ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వారికి జ్ఞాపికలు అందించారు. ౧ విజేతలకు మెమోంటోలు, మెడల్స్‌ను ఎల్ఐసి సంస్థ, శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్, మన్యం నవీన్ ఎలక్ట్రానిక్స్, కొకోకోల కంపెనీ, ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ గ్రద్యూయేట్స్ అసోసియేషన్ అందచేశారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా ఆయా సంస్థల ప్రతినిధులను మెమోంటోలు అందించి సత్కరించారు.

నూతనోత్సవాన్ని నింపిన బాలోత్సవం

రెండు రోజుల గోదావరి బాలోత్సవం చిన్నారుల్లో నూతనోత్సవాన్ని నింపింది.ఆదివారం అకడమిక్, కల్చరల్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అకడమిక్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో స్పెల్‌బి, కార్టూన్, చిత్రలేఖనం పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగాయి. వక్తృత్వం పోటీల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలోజూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. అంతర్జాలంలో అన్వేషణ సీనియర్స్ విభాగంలోనూ, పద్యం భావం జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, మట్టితో బొమ్మలు తయారీ అంశాల్లో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కల్చరల్ విభాగంలో జానపద నత్యం విభాగంలో సీనియర్స్ పెద్ద ఎత్తున పాల్గొని కళా ప్రదర్శనలు ఇచ్చారు. స్టేజ్ 5 వద్ద సీనియర్ భాగంలో క్లాసికల్ డ్యాన్స్‌లతో చిన్నారులు ఆకట్టుకున్నారు. లఘు నాటిక, ఏకపాత్రాభినయం విభాగాల్లో పెద్ద ఎత్తున చిన్నారులు పాల్గొన్నారు. దేశభక్తి అభ్యుదయ జానపద గీతాలాపనలో తమ తమ ప్రతిభను చాటుకున్నారు. అలాగే సీనియర్స్ విభాగంలో బందాలుగా చేసిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో విచిత్ర వేషధారణ పోటీల్లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలు చేశారు.

ఆట పాటలతో మెప్పించారు... విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలతో ఔరా..! అనిపించారు. నాట్య మయూరాల్లా నర్తించారు... పాటల్లో మాకు మేటి ఎవరు? నాటకాల్లో మాకన్నా సాటి ఎవరు? అని చాటి చెప్పారు... భవిత మాదే భారత్ మాదే అంటూ ఆసల ఊసులతో ఉరిమే ఉత్సాహంతో వచ్చే యేడు మళ్లీ కలుద్దాం..అంటూ బాలోత్సవానికి వీడ్కోలు పలికారు. సృజన్మాకతకు సరైన వేదిక బాలోత్సవం అని రుజువు చేశారు..

చిన్నారులతో నిండిపోయిన ముగింపు సభా ప్రాంగణం

విజేతలతో ముఖ్యఅతిథులు, నిర్వాహకులు

న్యాయ నిర్ణేతలకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

జ్ఞాపికలను అందిస్తున్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ శర్మ

గురువుతో కలిసి ఫొటోకు ఫోజులిస్తున్న విద్యార్థినులు

నేరాలు ఘోరాలు

500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - కపిలేశ్వపురం

మండలంలో కోరుమిల్లి నదీపరీవాహక ప్రాంతంలోని సారా తయారీకేంద్రాలపై సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఇబి సిఐ ఎంఎ.ఖాదిర్, ఎస్ఐ ఎ.సత్యవాణి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. నిర్వాహకుని కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సిఐ ఖాదిర్ తెలిపారు. ఈ దాడుల్లో అంగర ఎస్ఐ కె.పరదేశి, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో సారా స్థావరాలపై ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలిచేరు గ్రామ శివారు, మారిశెట్టి వారి గూడెం శివారు నాటు సారా రవాణా చేస్తున్న మట్ట దుర్గాప్రసాద్‌ను అదుపులో తీసుకున్నారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని ఎర్రపోతవరం లాకుల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లక్ష్మీ నరసాపురం గ్రామానికి చెందిన పిల్లి ప్రసాద్(28), అనపర్తి సావరానికి చెందిన డి.జాన్ (30) స్కూటర్‌పై యానాం నుంచి ద్రాక్షారామ వైపు వస్తున్నారు. వారు ఎర్రపోతవరం లాకుల వద్దకు చేరుకునే సమయానికి ద్రాక్షారామం నుంచి యానాం వైపు ఎరువుల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.


నిందితులు నివసించిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోటలో చోరీ ముఠా మకాం

ప్రజాశక్తి -సామర్లకోట

ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్ బ్యాంకులో ఈ నెల 7న జరిగిన చోరీ కేసుతో సంబంధం ఉన్న ముఠా సామర్లకోటలో ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాకినాడ ట్రైనీ డిఎస్‌పి సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారు. సామర్లకోట -పిఠాపురం రోడ్డులోని ముస్లిముల ఏరియాలో ఐదుగురు సభ్యులు రూమ్ అద్దెకు తీసుకుని బ్యాంకు చోరీకి పాల్పడినట్టుగా అనుమానిస్తున్నారు. సామర్లకోట కోటబజార్ ఏరియా ముస్లిముల ఇంట్లో పది రోజులు పాటు అద్దెకు ఉన్నట్లుగా అనుమనిస్తున్నారు. ఈ మేరకు ఇంటిని పరిశీలించారు. అబ్దుల్లా అనే వ్యక్తి ఇంట్లో ఓ గదిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు సభ్యులు నెలకు రూ.3వేలకు అద్దెకు తీసుకున్నారు. పది రోజులపాటు ఇక్కడే ఉండి ఉత్తరకంచిలో రెక్కీ నిర్వహించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీంతో సుమారు రెండు గంటల పాటు ఈ గదిని పోలీసులు పరిశీలించారు.

యానాం వార్తలు

ఆట్యా పాట్యలో షణ్ముకప్రియకు స్వర్ణం

ప్రజాశక్తి - యానాం

జాతీయస్థాయిలో జరిగిన ఆట్యాపాట్యా గేమ్స్‌లో యానాం నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని చింతా దుర్గలక్ష్మిషణ్ముఖప్రియ బంగారు పతకం కైవసం చేసుకుందని విద్యా సంస్థల చైర్మన్ నల్లం నాగబాబు తెలిపారు. ముంబైలో ఈనెల 9నుంచి 11వరకూ ఈ జాతీయ స్థాయి పోటీలు జిరగాయన్నారు. అండర్-14 బాలికల విభాగంలో పుదుచ్చేరి జట్టు తరుపున పాల్గొన్న షణ్ముఖప్రియ ప్రతిభ కనబర్చి బంగారు పతకం కైవసం చేసుకుందని తెలిపారు. బాలిక తండ్రి చింతా వెంకన్న వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. పాఠశాల కూడా పూర్తి సహకారం అందించడంతో విద్యార్థి బంగారు పతకం సాధించిందని నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా బాలికను పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, నల్లం విద్యా సంస్థల చైర్మన్ నల్గం నాగబాబు, ఎన్ఆర్ఐ చింతా గణేష్, శివ తదితరులు అభినందించారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

పలుగ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఆదివారం శ్రీకారం చుట్టారు. కనకాల పేట, మెట్టకూరు, ఫరంపేట, సుభద్ర నగర్, మెుండి వారి వీధిలో డ్రెయినేజీల ఆధునికీకరణ, రోడ్ల నిర్మాణం, ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. పలు గ్రామాల్లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో తన సొంత ఖర్చులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లోనూ త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రాంతీయ పరిపాలనాధికారి నాయక్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ప్రజా పనుల శాఖ ఎఇ కాళ్ల నాగరాజు, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, ఎఇ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ అశోక్‌తో టీచర్స్ నూతన కార్యవర్గం

ఎంఎల్ఎను కలిసిన టీచర్స్ నాయకులు

ప్రజాశక్తి - యానాం

నూతనంగా ఎన్నికైన యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ కారుమూరి పవన్ దుస్సాలువాతో ఎంఎల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బొంతు సత్య శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ దాసరి కళ్యాణ్‌బాబు, సెక్రటరీ రత్ననాయుడు, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, జాయింట్ ట్రెజరర్ పి.జయపాల్, కో-ఆర్డినేటర్ ఎ.విజయలక్ష్మి, సభ్యులు పితాని రామచంద్రరావు, గౌరీ శంకర్, గీదా సత్యనారాయణ, మెండా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

తాళ్లరేవు మండలం కాపుల పాలెం గ్రామానికి చెందిన చెందిన గుబ్బల వీరవెంకటసత్యనారాయణ నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. యానాం నుంచి అక్రమంగా తరలిస్తుండగా కనకాలపేట ఏటుగట్టు వద్ద పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.8వేలు ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

మలేరియా అధికారి భాస్కరరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వాతావరణంలో మారుతున్న పరిస్థితులను బట్టి వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవగాహన ఉంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) ఎస్.భాస్కరరావు అన్నారు. సీజన్లో ప్రధానంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. నీటి నిల్వ లేకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలి.

వర్షాకాలం వచ్చే సరికి నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను వివరించారు.

మలేరియా, డెంగ్యూ ఎలా వ్యాపిస్తుంది. మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి

డెంగ్యూ వ్యాపించే ఆడ ఎడిస్ దోమ శుభ్రమైన నీటిలో పెరుగుతుంది. ఈ దోమ కుట్టిన వారం రోజులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే డెంగ్యూగా పరిగణించాలి. వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు (ప్లేట్లెట్స్) తగ్గి పరిస్థితి విషమించే ముప్పు ఉంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యు సోకుండా చూసుకోవచ్చు. ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసరాల్లో నీరు నిలిస్తే ఆయిల్ బాల్స్ చల్లాలి. కాకినాడ జిల్లాలో 2019లో 513, 2020లో 72, 2022లో 496 కేసులు, 2023లో 224, ఈ ఏడాది ఇప్పటి వరకు 6 కేసులు వెలుగులోకి వచ్చాయి. అప్రమత్తంగా లేకుంటే కేసుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

వ్యాధుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గతేడాది ప్రతి ఇంటిలోనూ ఒకరికి వ్యాధులు సోకి ఆస్పత్రులలో చికిత్స పొందారు. ఈ ఏడాది కూడా వ్యాధుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలోని, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ కాలంలో దోమల వద్ధి ఎక్కువగా ఉంటుంది. పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. పూలకుండీలు, వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టుపక్కల పాత టైర్లు, తాగి పాడేసిన కొబ్బరి బోండాలు ఉండకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం మంచింది.

డయేరియా రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

కలుషిత నీటిని తాగడం, ఆహారాన్ని తినడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. వర్షాలకు ఇంటి పరిసరాలు చిత్తడిగా మారి ఈగలు పెరుగుతాయి. ఈగలు మనం తినే ఆహార పదార్థాలపై వాలి కలుషితం చేస్తాయి. దీంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకకుండా పరిసరాల శుభ్రతను పాటించాలి. ఇంట్లోకి ఈగలు రాకుండా జాలీ వంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు, ద్రవపదార్థాలు పడేయకూడదు. వేడి పదార్థాలను తీసుకోవడం మంచింది.

వైరస్‌ల ప్రభావంతో వచ్చే జర్వాలు వాటి ప్రభావం ఎలా ఉంటుంది

వర్షాలు కురిసే సమయంలో వైరస్ ప్రభావం ఎక్కువ ఉంటుంది. దగ్గు, జలుబుతో మొదలై జ్వరం వస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఎక్కువై ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. వృద్ధుల్లో శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఆయాసం పెరుగుతుంది. చిన్నపిల్లల్లో జ్వరం ఎక్కువగా వస్తే మూర్ఛపోయే అవకాశాలు ఉంటాయి. నిల్వ ఉన్న పదార్థాలు తినకూడదు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించడం వల్ల వైరస్‌లు వ్యాపించవు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కూడా శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిని తాగాలి.

సీజన్ వ్యాధుల నివారణ కోసం చేపడుతున్న చర్యలేమిటి

కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాము. క్షేత్ర స్థాయిలో పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల్లో డెంగ్యూ ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచాము. డెంగీ కేసులున్న చోట 50 నుంచి 60 ఇళ్ల పరిధిలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే, యాంటీ లార్వా గాలిలో మందు పిచికారీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతోపాటు పిహెచ్‌సి, సిహెచ్‌సిల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేస్తున్నాము. వైద్య సిబ్బందిని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

ఘనంగా నాగేశ్వరరావు పుట్టినరోజు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పూలే ప్రజా చైతన్య వేదిక అధ్యక్షుడు, టిడిపి నాయకులు చీకట్ల నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు స్థానిక యువకులు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పదో క్లస్టర్ ఇన్‌ఛార్జి మోపూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాగేశ్వరరావు కనబరిచే ఉద్యమ స్ఫూర్తి ఆదర్శనీయమని అన్నారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది పేద మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర రామచంద్ర రావు, తాతపూడి నాగేశ్వరరేవు, శ్రీలక్ష్మీగణపతి వర్తక సంఘం ప్రెసిడెంట్ నామా గోపాల కృష్ణ, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ విత్తనాల ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కరాటేలో బాలభారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- తాళ్లరేవు

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం నిర్వహించిన 4వ ఎపి ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో శ్రీ బాల భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు కరెస్పాండెంట్ పి.బాల వెంకటరమణ తెలిపారు. ఈ పోటీల్లో ఏడో తరగతి విద్యార్థి గుబ్బల శ్రీమన్నారాయణ గోల్డ్ మెడల్ సాధించాడు. మల్లాడి నరేంద్ర వర్మ (7వ తరగతి), ఇళ్ల విజయ్ కుమార్ (5వ తరగతి) సిల్వర్ మెడల్స్ సాధించారు. ఐదవ తరగతి విద్యార్థులు వెదురుపాక దుర్గా మణికంఠ, సమనస వికాస్ శ్రీ సత్య కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.


చెక్కును అందజేస్తున్న నరసింహం

జగ్గంపేటలో ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేటలో వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఆదివారం మాజీ మంత్రి, వైసిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసింహం మాట్లాడారు. మహిళల కోసం వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి వంటి పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్ మోహన్ రెడ్డిదే అన్నారు. భారతదేశంలోనే ఇటువంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సిఎం ఎవరూ లేరన్నారు. మండలంలోని 1,818 స్వయం సహాయక సంఘాలకు విడుదలైన రూ.16.39 లక్షల వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు అత్తులూరి నాగబాబు, చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపిపి నక్కా శ్రీను, వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, తోట రామ్‌జీ, అత్తలూరి సాయిబాబు, ఎపిఎం జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి వరుపుల పరామర్శ

రౌతులపూడి : మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సోమరౌతు తిరుమల వెంకన్న దొర ఇటీవల అనారోగ్యానికి గురవగా ఆయనను వైసిపి ప్రతిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సుబ్బారావు ఆదివారం పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, భాస్కర్ బాబు, మాజీ జెడ్‌పిటిసి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని రౌతుల పూడి శివాలయం వీధిలో గుబ్బల రామయ్యమ్మ, బత్తిన ఆనంద్‌కు చెందిన పెంకుటి ఇల్లు ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. గ్యాస్ లీకవ్వడంతో ఈ ప్రమాదం సంభవించింది. వంట సామాగ్రితో సహా పూర్తిగా దగ్ధం కావడంతో బాధితులు కన్నీరు మున్నీరయ్యారు ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధ్యతలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబాన్ని సొసైటీ మాజీ డైరెక్టర్ యర్రా వరహాలదొర పరామర్శించారు. వారికి ఆయన రూ.5వేల సాయం అందించారు.

దస్తావేజు పోయినవి

కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు, కరణంగారి తోట, డో.నెం. 5-135రు కాపురస్తులు విశ్వనాధుల రామకృష్ణ గారి భార్య **విశ్వనాధుల వీరలక్ష్మి** గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,
నా ఆస్థికి సంబంధించి ది.**04-09-2023**వ తేదీన పిఠాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్ట్రీ కాబడిన సవరణ దస్తావేజు నెం. **8259/2023**ను జెరాక్స్ తీసుకొను నిమిత్తం ది.26-01-2024 తేదీన మా ఇంటి నుండి రాయవరం రోడ్డులో M.R.O. ఆఫీసు దగ్గరలో గల జెరాక్స్ షాపుకు తీసుకొనివెళ్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. సదరు సవరణ దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.
విశ్వనాధుల వీరలక్ష్మి
W/o. రామకృష్ణ, డో.నెం.5-135
కరణంగారి తోట, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం
కాకినాడ జిల్లా, సెల్: 9494903540